బందిపోట్లుగా ముద్రపడిన వారు ఊరంతా మెచ్చుకునేలా చేసిన హత్య?

# విపుల కథ

# అన్యాయానికిచ్చిన తీర్పు

బైట ఎండ చాలా తీక్షణంగా వుంది. ఊరు క్రొత్త. పరిసరాలు క్రొత్త. నేను బాబాయిగారి ఊరువచ్చి వారం రోజులైనా నా కింకా క్రొత్తగానే వుంది ఆ ఊరు, ఊరిలోని వారు కూడా!

అది పట్టపగలే అయినా అర్ధరాత్రి సమయంలో వుండే నిశ్శబ్దత, ప్రశాంతత ఆవరించుకొని వున్నదా ప్రాంతమంతా. అక్కడ వీస్తున్న గాలి శబ్దం తప్ప మరే శబ్దం వినరావడం లేదు.

అతి నిశ్శబ్దంగా వున్న ఆ ప్రదేశంలో నా అడుగులు మాత్రం లయబద్ధంగా పడుతున్నాయి. నా గుండె కొట్టుకునే శబ్దం నాకే విచిత్రంగా విన్పిస్తోంది.

అక్కడ చుట్టూ వున్న పొలాలు, తాటితోపులూ, పూలతోటలు వాటి మధ్యలో నేనూ ఉన్నాను సుమా అన్నట్లు గుర్తు చేస్తూ గలగల పారే సెలయేరూ. ప్రకృతి ఆహ్లాదకరంగా, చూడముచ్చటగా వుంది. పొలాలమీద నుండి, పూదోట మీదనుండి వచ్చేగాలి వింత పరిమళాన్ని మోసుకొస్తుంటే వింతగా అన్పిస్తుంది. పట్నాలలో వుండేవారు ఇలా అప్పుడప్పుడూ పల్లెలనొకమారు చూస్తూ వుంటేనేగానీ పల్లెలలో ఎంత ప్రశాంతత ఉంటుందో అర్థంకాదు. ప్రకృతిని చూస్తూ ఆనందిస్తూ నడుస్తున్నాను. వెంట నేను తెచ్చుకున్న కెమేరా నా భుజానికి వ్రేలాడుతూనే వుంది. 'ఇంకా నాకు పని తగల్లేదా' అని అది నన్ను అడుగుతున్నట్లనిపించింది.



ఇంటి దగ్గర్నుండీ బైలుదేరి వస్తుండగా పిన్ని అన్నమాటలు గుర్తొచ్చినాయి.

"మనూ! జాగ్రత్త! త్వరగా చీకటి పడకముందే వచ్చేయి. ఇక్కడ బందిపోటు దొంగల భయం ఎక్కువ. చీకటిపడుతూనే తలుపులు బిగించేసుకుంటారు వూళ్ళోవాళ్ళందరూనూ!"

చెప్పులు తొడుక్కుంటున్న నేను

నవ్వుతూ అన్నాను.

"ఏమిటి పిన్నీ! విహావూళ్ళో దొంగలు చీకటి పడుతూనే వస్తారా?"

"నీకు ఏ మాటనైనా నవ్వుతూ కొట్టేయడం చిన్నప్పటినుండీ అలవాటేగా" సన్నగా విసుక్కుంది పిన్ని.

"వస్తానుపిన్నీ. నాకోసం ఎదురు చూడకండి. నువ్వు, బాబాయ్ భోంచేసేయండి, నేను వచ్చేసరికి లేటౌతుందేమో!"

"మనోహర్! నీకు పుణ్యం ఉంటుందిరా బాబూ! నామాట వినరా! ఈ వూరు మంచిదికాదు. నువ్వు నిక్షేపంగా వచ్చావు. క్షేమంగా తిరిగివెళ్ళు"పిన్ని ఆదోళనగా అన్నది.

ఆమె అమాయకత్వానికి నవ్వుకుంటూ బైటపడ్డాను.

"త్వరగా వచ్చేయి. మనూ" గేటు దాటుతుంటే పిన్ని కేకపెట్టింది మళ్లీ.

పిన్నీ, బాబాయి ఎప్పటినుండో తమ వూరు రమ్మని గొడవచేస్తున్నారు. ఎప్పటికప్పుడు ఇప్పుడుకాదు., తరువాత అంటూ నేను నెట్టుకొస్తున్నాను. కాని ఈసారి మాత్రం పెద్దమ్మ కూతురు సుధ పెళ్ళికి వెళ్ళినప్పుడు మాత్రం గట్టిగా పట్టు బట్టడంతో రాకతప్పలేదు.

పోనీలే ఊరు చూసినట్టూ ఉంటుంది. వాళ్ళను తృప్తిపరచినట్లూ ఉంటుంది అని కేవలం నా ఇంటరెస్ట్‌తోనే పదిహేనురోజులు సెలవుపెట్టి వాళ్ళతో పాటే బైలుదేరాను.

కాని వచ్చిన నాల్గురోజులకే బోర్ కొట్టేసంది ఆ వూరు నాకు. ఏ సాకు దొరుకుతుందా ప్రయాణమౌదామా అనుకుంటున్న నాకు నేను రావడంతోటే పరమానంద పడిపోతున్న పిన్నీ, బాబాయిల ముఖాలు చూసేసరికి అప్పటివరకూ వెళ్ళిపోవాలనుకున్న నాకు వాళ్ళ ఆనందం నన్ను బంధించినట్లయేది.

పిన్ని, బాబాయిలకు పిల్లలు లేరు. అందుకని చిన్నప్పటినుండీ నన్ను తమ కొడుకులానే చూసుకునేవారు. వాళ్ళను నిరుత్సాహపరచి వెళ్ళి మాత్రం తను చేసేదేముందక్కడ. ఎప్పుడూ వుండే లైఫేగా! పోనీ ఛేంజ్‌గా వుంటుంది. ఎలానూ లీవు పెట్టాను.ఊరంతా తిరిగితే నన్నా తనకు ప్రొద్దుపోతుంది. ఏమైనా విశేషాలు, వింత న్యూస్ ఏదైనా దొరుకుతుందేమో చూద్దాం అనుకొని బైలుదేరాను. చేస్తున్నది జర్నలిస్టు ఉద్యోగమవడంతో ఎక్కడికి పోయినా తనను వెన్నంటివుండే ఈ కెమెరాతోపాటుగానే ఈ ఆలోచన కూడా విడవదనుకుంటాను నన్ను.

నాకు మొదటినుండి జర్నలిజంపట్ల అభిలాష ఎక్కువగా ఉండడంవల్ల ఏ లాయరునో, డాక్టరునో చేయాలనుకున్న మా నాన్నగారి కలలన్నీ కల్లలుచేసి నేను మాత్రం జర్నలిస్టునై కూర్చున్నాను.

నాన్నగారి ప్రోత్సాహంతో నా ఆనందానికి హద్దులు లేకపోయాయి. ఆ ఆనందంలో నేను చేసిన సాహసాలు ఎన్నో.

తహసీల్దారు దగ్గర్నుండీ మినిష్టరువరకూ వాళ్ళ అన్యాయాలను, అక్రమాలనూ వేలెత్తి చూపినట్లు విమర్శించే వాడిని. వాళ్ళందరికీ వ్యక్తిగతంగా నేనంటే ఎంతో ద్వేషం, పగ రగలటానికి కారకుడ్నయ్యాను. కాని నా మీదెంత పగ, కోపంవున్నా మా నాన్నగారికున్న పలుకుబడివల్ల వాళ్ళు నన్నేమీ చేయలేక నా మీదున్న కోపాన్ని విషంలా దిగమింగి వూరుకోక తప్పలేదు.

నా ఆలోచనల్లో నేనుండి నేనెటు పోతున్నదీ నాకే తెలియలేదు. చుట్టూ చీకటి చిక్కగా అలుముకుంది. అయినా అక్కడ అక్కడా వెలుగురేఖలు పొడసూపుతున్నాయి. దట్టంగా వున్న చెట్లమధ్యనుండి వచ్చే వెలుగు కిరణాలు, ఆ దృశ్యం చూడడానికి చాలా మనోహరంగా వుంది.

వెంటనే భుజానికున్న కెమేరాను తీసి ఆ ప్రకృతి కాంతను నా కెమేరాలో బంధించాలన్న ప్రయత్నంలో పడ్డాను.

ఆ ప్రయత్నంలో కెమేరాను ఏంగిల్‌లో పెట్టుకొని చూస్తున్న నాకు దగ్గరలో కలకలం వినిపించసాగింది.

కొంచెం దూరంలో సెలయేటికి దగ్గరగా కొంతమంది గుమిగూడి ఉండటం కన్పించింది.

అప్రయత్నంగా, కుతూహలంగా అటుకేసి నడిచాను. అక్కడ గుమిగూడి వున్న వారిమాటలన్నీ కలగా పు లగంగా ఉన్నాయి. ఒక్కటీ అర్థం కావడంలేదు.

కానీ అందరి ముఖాల్లోనూ కొట్టవచ్చినట్లు ఆతృత, జాలి, భయం, ఇంకొంచెం ముందుకువెళ్ళి చూశాను కుతూహలంగా.

అక్కడ కన్పించిన దృశ్యాన్ని చూసి స్థాణువై నిల్చుండిపోయాను.

అది శవం. చెరువులో కొట్టుకొచ్చిన శవం.

శరీరమంతా ఉబ్బిపోయి గుర్తుపట్ట వీలులేకుండా ఆకారం మారిపోయి వికృతంగా ఉంది. చుట్టూ చేరిన వారందరూ తలా ఒక మాటంటున్నారు. అందులో నాకర్థమైందేమంటే అది ఆ వూరి

## నచ్చవు



చేతిలో ఆపిల్ పళ్ళు పట్టుకొని ఆఫీసరు ఆనందమూర్తి ఇంటికొచ్చాడు విశ్వనాథం.

"ఎందుకయ్యా.... ఇన్ని పళ్ళు తీసుకొచ్చావ్... డబ్బు దండగ... అయినా నాకు ఇలాంటివి నచ్చవు. ఈ సారికి సరేగానీ ఇంకెప్పుడు తేకు" అన్నాడు ఆనందమూర్తి.

"అబ్బే మీ సంగతి నాకు తెలిదటండీ. మా ఆవిడకు జ్వరంగా వుంటేను బజారొచ్చి పళ్ళు కొన్నాను. దార్లోనే కదా మిమ్మల్నోసారి చూసి పోదామని వచ్చాను" నవ్వుతూ చెప్పాడు విశ్వనాథం.

—దుప్పాడ రామకృష్ణ నాయుడు (శ్రీకాకుళం)

మోతుబరి రైతు ఒక విధంగా జమీందారి స్థాయిలో వున్న భూషణంగారి దగ్గర పాలేరుగానున్న సాంబయ్య శవం.

అతను రెండురోజులమండీ కనబడడంలేదనీ, చివరికి ఇలా తేలాడని అక్కడున్న అందరూ సానుభూతి చూపించసాగారు.

ఎవరి సానుభూతీ, జాలీ ఇంక నాకేమీ అవసరం లేదన్నట్టు ఈ లోకానికి అతీతంగా వున్నాడు సాంబయ్య.

ఇంతలో పోలీసులు వచ్చారు. జరగవలసిన తతంగమంతా జరిగిపోతుంది. వెంట తెచ్చుకున్న కెమేరా సార్థకమైనదనుకుంటూ నేను కూడా కొన్ని ఫోటోలు తీసుకున్నాను.

పోలీసులు, పెద్ద మనుషులు అంతా గందరగోళంగా వుంది పరిస్థితి.

అప్పటిగా బాగా చీకటి పడడంతో వెనక్కు తిరగక తప్పలేదు. నడుస్తున్నాన్న మాటేగాని మెదడులో సుళ్ళు తిరుగుతున్న ఆలోచనలను మాత్రం ఆపలేకపోయాను.

పిన్ని చెప్పిన ఆ బందిపోట్లకూ, ఈ హత్యకూ ఏమైనా సంబంధం వుందా, బందిపోట్లు హత్య చేశారంటే శవాన్ని కాలువలో పడేసే అవసరం వాళ్ళకేమిటి? ఎక్కడ హత్య చేశారో అక్కడే వదిలేయొచ్చుగా. అయినా ఈ వూరిలో మోతుబరి రైతులుండగా ఏదిక్కూ మొక్కూ లేని తినడానికి తిండి కూడా లేని ఆ సాంబయ్యను హత్య చేయవలసిన అవసరం వాళ్ళకేమిటి? ఇదేదో మిస్టరీలానే వుంది. ఆలోచిస్తూ ఇంటికి చేరాను.

ఇంటికి చేరుతూనే పిన్ని ఆత్రంగా అడిగింది.

"ఏరా! మనూ! ఇప్పటివరకూ ఎక్కడ తిరిగావు? ఏమైనా విశేషాలు సేకరించావా?" నవ్వుతూ అడిగింది. నెమ్మదిగా జరిగిన విషయం చెప్పాను. నా మనసులోనున్న అనుమానాల సంగతి కూడా చెప్పాను.

"అవన్నీ నీకెందుకులే బాబూ! సరదాగా వచ్చావు. వున్నన్ని రోజులూ సరదాగా తిరిగి చూసి వెళ్ళు నాయనా! ఈ వూరి సంగతులు నీకెందుకుగానీ..."

మాట దాట వేయబోయింది పిన్ని.

"కాదు పిన్నీ. అసలేమిటో చెప్పు. ఆ భూషణం ఎలాంటివాడు? విషయాలు తెల్సుకోవడంలో తప్పేమీలేదు. అందులో ప్రమాదమూ లేదు. చెప్పు పిన్నీ."

నేను చాలాసేపు బతిమిలాడడంతో, ఏ విషయాల్లోనూ జోక్యం చేసుకోనని నాదగ్గర మాట తీసుకొని మెల్లగా చెప్పింది పిన్ని.

భూషణం ఆ వూరి కంతటికీ మకుటం లేని మహారాజు. ఏమి చేసినా ఇదేమిటి? అనేవాళ్ళుగాని, అతనికి ఎదురు నిలబడి ధైర్యంగా అడిగేవాళ్ళు గానీ ఆ వూరిలో ఒక్కడు కూడా లేకపోవడంతో అతని ఆటలు ఇంకా విచ్చలవిడిగా కొనసాగించాడు.

వయసులో వున్న ఆడపిల్లలు అతనికంటపడితే చాలు వాళ్ళను పాడుచేయనిదే వదలడు. అన్యాయంగా పేదలనోళ్ళు కొట్టడం, ప్రజల పేరిట


ప్రభుత్వాన్నుండి ఆస్థులను రాబట్టి అమాయకులైన పల్లె ప్రజలను మో సగించి, ఆ ఆస్థులను తానే సంగ్రహించితే, ఎవరైనా కొంచెం ధైర్యం వున్నవాడు ఇదేమని అడిగితే వాడికి చా వుదెబ్బలు బహుమతిగా ఇచ్చి పంపేవాడు.

అతనికి ఇవన్నీ చేయడంలో కుడిభుజంగా మార్చుకున్నాడు అమాయకుడైన సాంబయ్యను. డబ్బుతో లొంగని మనిషెవరు? ఆకలితో అలమటిస్తూ తిండీ, నీడాలేక వీధులంట అడుక్కుంటూ బ్రతుకుతున్న సాంబయ్య ఆర్థిక పరిస్థితులు ఏ పని అయితేనేం డబ్బులు వస్తున్నప్పుడు అనుకొనేలా చేసాయి. తను ఏ పని చేయడానికైనా సాంబయ్యను అడ్డుగా పెట్టుకొని అతనితోటి చేయించేవాడు, కొన్నాళ్ళకు హత్యలు చేయడానికి కూడా వెనుకాడని విధంగా తయారు చేశాడు భూషణం సాంబయ్యను. అలాంటి పన్లుకూడా చేయించాడంటారు ఊళ్ళోని జనం. మరి నిజమెంతో మనకూ తెలియదుగా బాబూ. డబ్బు, అహంకారం వున్నదగ్గర ఎలాంటి పచ్చి నిజాలైనా మరుగున పడ్తాయి. అయినా ఇవన్నీ నీకెందుకులే మనూ'' అంటూ విన్పించాల్సినవే వినిపించింది పిన్నీ.

ఆ రాత్రి పడుకున్నా వన్నమాటేగానీ నిద్రపోలేదు నేను. ఒక ప్రక్క పిన్ని మాటలు చెవుల్లో గింగురు మంటున్నాయి. మరొక ప్రక్క సాంబయ్య శవం కళ్ళముందు మెదులుతోంది.

అంత నమ్మిన బంటుగా వున్న సాంబయ్య హఠాత్తుగా ఇలా మృత్యువాత బడడానికి కారణమేమిటి? దానికి కారకులెవరు? భూషణమేనా? ఎందుకంత అవసరమొచ్చింది? ఎదురు తిరిగాడా? చెప్పిన పని ఏమైనా చేయనన్నాడా? అంత మాత్రాన చంపాల్సిన అవసరం ఏమిటి? ఎటు చూసినా జవాబు దొరకని ప్రశ్నలే. ఎంతగా ఆలోచించి బుర్ర బద్దలు కొట్టు

## నిజంగా నిజం



యాదృచ్ఛికంగా జరిగినా... కొన్ని సంఘటనలకు ఎంతో ప్రత్యేకత వుంటుంది! చదవండి మీకే తెలుస్తుంది! లింకన్ 1860లో అమెరికా ప్రెసిడెంట్ అయితే కెన్నెడీ 1960లో ప్రెసిడెంట్ అయ్యాడు. ఇద్దరూ తమ భార్యల సమక్షంలో శుక్రవారంనాడే చంపబడ్డారు. ఇద్దరి వారసులుగానూ పార్టీ తరఫున నామినేట్ చేసిన వారిపేరు జాన్సనే! మొదటి జాన్సన్ 1808లో పుడ్తే... రెండో జాన్సన్ 1908లో పుట్టారు. లింకన్ సెక్రటరీపేరు కెన్నెడీ. కెన్నెడీ సెక్రటరీ పేరు లింకన్. సెక్రటరీలమాట వినకుండా ఇద్దరు బయటకు వెళ్లి మరణాన్ని తెచ్చుకొన్నారు. లింకన్‌ను థియేటర్‌లో చంపి చెప్పుల షాపుకు ఆగంతకుడు పరుగెడ్తే, కెన్నెడీని చెప్పులషాపులో చంపి థియేటర్‌కు పారిపోయాడు ఆస్వాల్డ్.

—జూపిటర్

కున్నా ఏదీ సరియైన కారణంగా కన్పించడంలేదు.

ఇంతవరకూ ఇలాంటివి కథల్లో వినడం, సినిమాల్లో చూడడం తప్పించి నాయీ ఆరేళ్ళ జర్నలిజంలో ఎదురైన అనుభవాల్లో ఎక్కడా చూడలేదు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ ఎదురవలేదు. తప్పకుండా ఈ విషయమేదో తేల్చుకొని కాని ఇక్కడనుండి కదలకూడదు. రాక రాక వచ్చినందుకు మంచి టాపిక్కే దొరికిందిలే అనుకుంటూ ఆలోచనల్తో ఎప్పుడో, ఏరాత్రో నిద్రలోకి జారుకున్నాను. తెల్లవారింది. లేచేసరికి పిన్ని రోజువారీ పనులలో నిమగ్నమై వుంది. బాబాయి అప్పుడే బైటకు వెళ్ళారనుకుంటాను.

లేచి, కాలకృత్యాలు ముగించుకొని టిఫిన్ తిని బైలుదేరాను. వెనుకనుండి పిల్చింది పిన్ని.

"ఏం బాబూ! నిన్నటి విషయం గురించేనా బైలుదేరావు. నీకు నిన్ననే చెప్పాను కదూ! నువ్వు ఇలాంటి వ న్నీపట్టించుకోకూడదని"
మందలింపుధోరణిలో మెల్లగా అన్నది పిన్ని.

"అందుక్కాదనీ, అసలటువైపే వెళ్ళనవి" పిన్నికి నచ్చ చెప్పి బైటపడ్డాను.

ఆ వూళ్ళో "రచ్చబండ" అనే స్థలానికి చేరుకున్నాను. అక్కడ అప్పటికే ఆ వూళ్ళో వున్న పెద్ద మనుషులందరూ చేరారు. బాబాయికూడా అక్కడే వున్నాడు. నన్ను చూడగానే దగ్గరకు పిల్చి అక్కడున్న అందరకూ నన్ను పరిచయం చేసాడు. అందరికీ నమస్కారాలందచేసి వాళ్ళు చూపించిన స్థలంలో బాబాయి ప్రక్కన కూర్చున్నాను. వాళ్ళందరికీ సాంబయ్య మరణమే చర్చనీయాంశంగా వున్నట్లుంది. వాళ్ళ మాటల్లో నాకు చాలా విషయాలు తెలిసాయి. భూషణం చెప్పినదానిలో చెడు ఎంతుందో, మంచి ఎంతుందో ఆలోచించకుండా అమాయకంగా అతని పాపాల్లో పాలుపంచుకున్న సాంబయ్య ఎవరికి ఈ దిక్కులేని చావు చా వడంతో అందరికీ చెప్పకోవడానికి అది విశేషంగానే కన్పించింది.

అప్పుడే సమయానికి అటుగాపోతున్న ఒకడిని పిల్చారు. అతను భూషణంగారి పాలేరు కిష్టయ్యని తెలిసింది. భూషణమంటే కోపమున్నా ఏమీ చేయలేని నిస్సహాయతతో అతనికి ఊడిగం చేస్తూ అవకాశం కోసం ఎదురు చూస్తున్న కొంతమంది పాలేర్లలో అతనూ ఒకడు. ఆ విషయం అతను చెప్పే ప్రతి మాటలోనూ ద్యోతకమౌతుంది. అంతా విని చివరికి అందరూ కల్సి ఒకటే విషయాన్ని తేల్చి ఒక నిశ్చయానికి వచ్చేశారు. అసలు సంగతి మెల్లగా బయటపడింది.

ఆరోజు కూడా అంటే వారంరోజుల క్రితం సాంబయ్యకు ఏదో డబ్బు అవసరమొచ్చి భూషణాన్ని అడిగాడుట. "నీకెందుకురా డబ్బు ... నీవేం చేసుకుంటావు. తిండి పెడ్తున్నాము


చాలదూ. నీ బ్రతుక్కి డబ్బు కూడాను'' అంటూ ఈసడించాడట. ఎన్నడూ కోపం ఎరుగని సాంబయ్య ఆ ఈసడింపుతో కోపం తెచ్చుకుని ''మాటలు తిన్నగా రానీయండి. నా బతుక్కి డబ్బొద్దా. అసలు మీరు ఇలా పెద్దొరు కావడానికి నాలాంటోరే కారణం. అది మీరు తెల్సుకోండయ్యా. అసలు మీరు చేస్తున్నపన్లు ఎలాంటివో'' ఇంకా ఆ తర్వాత మాటలు సాంబయ్య చెప్పేస్తే అవి అందరూ వింటే ప్రమాదమని భావించిన భూషణం తెలివిగా చటుక్కున సాంబయ్య దగ్గరకు వచ్చి అతడి నోరు మూసేశాడు.

''అబ్బబ్బ. ఇంతదానికి కోపమెందుకురా. నేను సర్దుతాగా తర్వాత రా'' అంటూ మెల్లగా సాగనంపాడు.

సాంబయ్య వెళ్ళిపోయిన తరువాత ఆయన చెయ్యి మీసాలమీదికి వెళ్ళింది. గుంభనంగా అనుకున్నాడు. ''ఊహ్హ! నాకు ఎదురు తిరిగి నిల్చి ధైర్యంగా మాట్లాడేవ రకూ వచ్చిందా నీ వ్యవహారం. చూస్తాను'' అని మెల్లగా అంటూ వెళ్తున్న సాంబయ్య వంక కర్కశంగా, భీకరంగా చూస్తూ మీసాలు తిప్పుకుంటున్న భూషణాన్ని అక్కడ పనిచేసుకుంటున్న వారందరూ చూసారు.

ఆ తర్వాత రోజే భూషణం మంచిమాటలతో సాంబయ్యను వెంటబెట్టుకొని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ తీసుకెళ్తుంటే 'సాంబయ్య మీదున్న కోపం మర్చిపోయాడేమో దొర' అనుకున్నారు కాని ఇంతలో ఇంత ఘోరం జరుగుతుందని ఎవరూ అనుకోలేదు.

''ఇయ్యాల సాంబయ్యను జేసినట్లే రేపు మమ్మల్నికూడా జేయడనేమిటి బాబయ్యా? మా పెళ్ళాం, పిల్లల బ్రతుకు లేమికావాలా? ఎవరూ ఏమీ చేయలేరా బాబయ్యా''



దీనంగా, ఆక్రోశంగా కిష్టయ్య అంటున్న మాటలతో అందిరిలోనూ చలనం వచ్చినట్లయింది.

అందరూ కూడబలుక్కుని ఈ అన్యాయాలు, అక్రమాలు ఇలానే సాగనిస్తే లాభం లేదని, ఒకళ్ళిద్దరు పాలేర్లను కోర్టువరకూ తీసికెళ్ళి అక్కడ సాక్ష్యం చెప్పించాలని ఆఖరుకు అందరూ తీర్మానించారు.

కాని డబ్బున్న దగ్గర, ఏ సాక్ష్యాలూ, ఏ తీర్పులూ పనికిరావు అన్నట్లుగా రెండురోజుల్లోనే కేసు గెల్చుకుని విజయగర్వంతో తిరిగివచ్చాడు భూషణం. ఆ వూళ్ళో వాళ్ళందరూ తనమీద కక్షకట్టినట్లుగా కూడ బలుక్కున్నట్లుగా కోర్టువరకూ పోవడంతో తన పరువూ, బ్రతుకూ బజారు కెక్కనున్నదని గ్రహించిన భూషణం డబ్బును విచ్చలవిడిగా ఖర్చుపెట్టాడు. డబ్బుకు లొంగని మనిషెవరు? ఆఖరికి విజయం ఆయనకే సమకూరింది.

కాలక్రమంలో రోజులు తిరిగిపోతున్నాయి. క్రమంగా అందరూ సాంబయ్య మరణాన్ని మర్చిపోగల్గుతున్నారు. నా సెలవులై పోయే రోజుదగ్గర పడింది. రేపో, మాపో బయలుదేరుదామనుకుంటున్నాను.

హఠాత్తుగా బందిపోట్లు ఆ వూరి పొలిమేరల్లోకి దిగారనే వార్త దావాలనంలా వూరంతా వ్యాపించింది. అంతా ఎవరికివారు ఈసారి ఎవరికి మూడిందో అని అనుకోసాగారు.

తుఫాను ముందు ఆవరించబోయే ప్రశాంతత అలుముకుంది అక్కడ. ఎవరికివారు తమ తమ ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాబోయే తుఫాను కోసం బిక్కుబిక్కు మంటూ ఎదురు చూడసాగారు.

ఆరోజు ఉదయమే నిద్రలేచిన నేను వినవచ్చిన విషయాలను వింటూ అలానే కొద్దిసేపు ఎక్కడి వాణ్ణక్కడే వుండిపోయాను. దీనికోసమా ఆ బందిపోట్లు ఈ వూరు వచ్చింది? జరిగింది లోకకళ్యాణార్థమే అయినా నాకెందుకో మనసు కలచివేసినట్లయింది. భూషణం ఎంత దుర్మార్గుడైనా అతనూ అందరిలాంటి మనిషే.

నాకెదురు వచ్చి సంతోషంగా ఈ విషయాన్ని చెబుతున్న పిన్నితో అదే మాట అన్నాను.

"చాల్లే! ఊరుకోరా మనూ! ఏమంటున్నావు నువ్వు. ఎంతమంది ప్రాణాలు అన్యాయంగా బలి తీసుకున్నాడు. ఆ వుసురు వూరికే పోతుందా? దేవుడు ఈ విధంగా చూపెట్టాడు."

నాకెందుకో పిన్ని మాటలు సంతృప్తిగా అన్పించలేదు. పిన్నితో చెప్పకుండా మెల్లగా బయటపడ్డాను. చెబితే పోనీయదని.

భూషణం ఇల్లెక్కడో తెలియకున్నా హడావిడిగా పరుగులు పెడ్తున్న జనంతో

పాటే నేను వెళ్ళాను. గుంపు మధ్య నుండి తప్పించుకుంటూ కొంచెం ముందుకెళ్ళి అలానే నిల్చుండిపోయాను.

భూషణం. శవం వళ్ళంతా ఖాళీ లేకుండా కత్తిపోట్లు ముఖమంతా కత్తితో చెక్కేసినట్లు వికృతంగా వుంది.

భూషణం చేసిన ఒక్కొక్క దుష్కార్యానికి ఒక్కొక్క కత్తిపోటు అన్నట్లుగా వుంది అతనిని చంపిన తీరు చూస్తుంటే. కడుపులో దేవినట్లయింది.

అతని భార్య కాబోలు తలపగలకొట్టుకుని ఏడుస్తుంది. ఆవిడ ఏడుపు హృదయ వికారంగా వుంది. అయినా అక్కడున్న ఏ ఒక్కరికీ జాలి కల్గించడంలేదు ఆమె బాధ.

"వీళ్ళ జిమ్మడ. వాళ్ళకు నామొగుడే దొరికాడు. వూళ్ళో ఇంతమంది ఉండగా నా మొగుడి ప్రాణాలే కావాలా ఆ సచ్చినోళ్ళకి. పోతూపోతూ నా బొట్టుకూడా తుడిచేసినారమ్మో" రాగాలాలిపించసాగింది ఆమె.

ఆడదానికి భర్త లోకానికెటువంటి వాడైనా ఆమెకు మాత్రము దేముడే. మన హిందూ సాంప్రదాయం రంగరించుకున్న ఎంతోమంది ఆడవాళ్ళల్లో ఆవిడ కూడా ఒకతే.

భూషణం చేసే అకృత్యాలు ఆమెకు తెలుసో, లేదో, తెలిసే అలా అంటున్నదేమో! ఎంతైనా భారత స్త్రీ కదా!

అక్కడున్న అందరూ తలా ఒకమాట అంటున్నారు. భూమిమీద ఒక దానవుడు అస్తమించాడు.

ఏమైనా నాకీ ఊరువచ్చినందుకు ఒక మంచి మేటరు దొరికింది. చిన్నగా నవ్వుకున్నాను. ఎవరి బాధలు వారివి. ఎవరి అవసరం వాళ్ళది. ఇంట్లోకి అడుగుపెడ్తున్న నాకు చటుక్కున ఒక విషయం స్ఫురణకు వచ్చింది.

భూషణం సాంబయ్యను చంపి తన అడ్డు తొలగించుకున్నాడు. ఆ అన్యాయాన్ని డబ్బుమదంతో గుప్పెటలో దాచుకున్నాడు

కాని ఆ అన్యాయాన్ని మాత్రం అన్యాయంతో సాధించారు బందిపోట్లు.

"కాగల కార్యాన్ని గంధర్వులే తీర్చారు" చిన్నప్పుడు చదువుకున్న సామెత గుర్తు వచ్చింది. మెల్లగా ఇంటివైపు అడుగులు వేశాను. రేపే నా ప్రయాణం. ఈ వూరికి గుడ్ బై చెబుతూ...

★



## మేలు

ఇంగ్లీషు పాఠం చెబుతున్నారు మాష్టారు.

"రామూ... నీ కంటే మీ చెల్లెలే మేలు... గా చదువుతుంది" అన్నారు మాష్టారు.

"తప్పుసార్... మా చెల్లెలు మేలు కాదు... ఫీ మేలు" చెప్పి కూర్చున్నాడు రాము.

సలీమ్ బాషా (కర్నూలు)